క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు

మానవపాడు: మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని అమరవాయి, గోకులపాడు, చెన్నిపాడు, మానవపాడు శివారు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



అయిజ: పట్టణంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ నాయకులు పట్టణంలోని ఉప్పలదొడ్డిపేట కాలనీలో పర్యటించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్ రెడ్డి, భీమసేన రావు, లక్ష్మణాచారి, రాజశేఖర్, ఇబ్రహీం, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



రాజోళి: గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ ఖాజా మెయినుద్దీన్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కేటాయించిన పనులను గ్రామాల్లో చేపట్టేందుకు నిధులు లేవన్నారు. దీంతో గ్రామాల్లో చాలా పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీంద్రపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ సంతోష్‌కు అఖిల పక్షం కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌ఎంగా పని చేస్తున్న రవీంద్ర నిబంధనలు విరుద్ధంగా నడుచుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఎంఈఓతో ఫోన్‌లో మాట్లాడి విచారణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అఖిలపక్షం కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.1.20 లక్షల ఆదాయం



ధరూరు: మండల పరిధిలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన వేలం ద్వారా రూ.1.20 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కవిత, ధర్మకర్త గిరి రావు తెలిపారు. కొబ్బరి చిప్పల సేకరణకు నిర్వహించిన వేలంలో రూ.1.20 లక్షలకు జెమ్మిచేడు గ్రామానికి చెందిన గోపాల్ దక్కించుకున్నట్లు తెలిపారు. టూరిజం భవనం అతిథి గృహం నిర్వహణ, టెంకాయలు, కిరాణం అమ్ముకునే హక్కులకు సంబంధించి తిరిగి వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

హిందూ ధర్మంపై అవగాహన



ఉండవెల్లి: మండల కేంద్రంలో హిందూ చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. సోమవారం హిందూ చైతన్య రథయాత్ర రాష్ట్రీయ స్వయం సేవక్ పాలమూరు విభాగ ప్రచారక్ దేవేందర్, విభాగ జాగర్న ప్రముఖ్ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రారంభమైనట్లు తెలిపారు. హిందూ ధర్మంపై అవగాహన కల్పిస్తూ యాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, హిందూ ధర్మ సమాజ నాయకులు పాల్గొన్నారు.

మట్టి వేయడంతోనే సరి!

- అధ్వానంగా గద్వాల- రాయచూర్ రహదారి
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



జాంపల్లి సమీపంలోని నెట్టెంపాడు కాలువ బ్రిడ్జి వద్ద గుంతలమయంగా రాయచూర్ రోడ్డు

ధరూరు: అంతరాష్ట్ర రహదారి రాయచూరు రోడ్డుపై అడుగడుగునా ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలను కలిపే ఈ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. మోకాలి లోతు గుంతలతో వాహనదారులు నరక యాతన అనుభవిస్తున్నారు. ఏళ్ల తరబడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

దుమ్ముతో తరచూ ప్రమాదాలు..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో వాహనాలు వేల సంఖ్యలో రాయచూర్ రోడ్డుపై తిరుగుతున్నాయి. దీంతో ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. మట్టి పోయడంతో వాహన రాకపోకల సమయంలో దుమ్ము ఎగసిపడుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళ్లల్లో దుమ్ము పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

దశాబ్దాలుగా గుంతల సమస్య...

ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం వేసిన రోడ్డు కావడంతో అక్కడక్కడ గుంతలు ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అప్పుడప్పుడు గుంతల్లో మట్టిపోసి కాలం వెల్లదీస్తున్నారు తప్పా.. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టడం లేదు. కనీసం ప్యాచ్ వర్క్‌లైనా చేయడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గద్వాల- రాయచూర్ రోడ్డులో ప్రధానంగా ధరూరు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద, సబ్ స్టేషన్ సమీపంలో, జాంపల్లి వద్ద, నెట్టెంపాడు ప్రధాన కాలువపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా, తాయమ్మ మిట్ట, ఈదమ్మ మిట్ట తదితర ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు...

రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అదే మార్గం గుండా ప్రయాణించే పాలకులు సైతం రోడ్డు మరమ్మతులపై పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ధరూరులో పెట్రోల్ బంకు వద్ద ఇలా...

మరమ్మతు చేపట్టాలి..

గద్వాలకు నిత్యం వాహనదారులు వందల సంఖ్యలో వెళ్తుంటారు. నడిరోడ్డుపై ఏర్పడిన గుంతలకు తాత్కాలిక ప్రాతిపదికనైనా మరమ్మతు చేపట్టాలి. గుంతల్లో మట్టిపోయడం వల్ల దుమ్ము ఎగసిపడుతోంది. దీంతో తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి.

తిమ్మప్ప, వాహనదారుడు, ధరూరు

ప్రతిపాదనలు పంపించాం..

ప్యాచ్ వర్క్ పనుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కూడా అయ్యింది. త్వరలోనే ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభిస్తాం. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నాం.

రామకృష్ణ, ఆర్‌అండ్‌బీ, ఏఈ

నాణ్యమైన భోజనం అందించాలి

ధరూరు: నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ మహిళలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వంట గదులు, సామగ్రి నిల్వ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

గట్టు: వంట గదులు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని ఎంఈఓ నల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటుగా ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నల్లారెడ్డి సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మన్నాపురంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉప్పలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



జింకలపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల పరిధిలోని జింకలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వడ్లల్లో తాలు, రాళ్లు, మట్టి పెల్లలు లేకుండా తీసుకొచ్చి అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఏపీఎం కుర్మయ్య, ఏఈఓ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి శారద, కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, రుక్మాందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భారతమ్మ, రాధమ్మ, తులశమ్మ, ఈదన్న, సర్వేష్, ఈరన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

అయిజ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పల గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయన్న, భాస్కర్ గౌడ్, లాల్ గౌడ్, మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణానికి స్థల పరిశీలన

గట్టు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల సౌకర్యార్థం టాయిలెట్ల నిర్మాణం కోసం సోమవారం ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ నల్లారెడ్డిలు స్థలాన్ని పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉన్నత పాఠశాల ఆవరణలో టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, సీఆర్‌పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ సన్నాహక సమావేశం..

సీఎం కప్ సన్నాహక సమావేశాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని పీడీ, పీఈటీలందరూ తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గద్వాల అర్బన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన నేషనల్ లెవెల్ ఇన్విటేషన్ కరాటే టోర్నమెంట్‌లో జిల్లా డ్రాగన్ షోటోకాన్ కరాటే విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. రిషిక, నర్సింహ్మ, ముస్తకిం, ఆప్నాలు బంగారు పథకాలు సాధించారు. అదే విధంగా అబ్బుజర్ వెండి పతకాన్ని సాధించగా.. సాయి సింధు, కిట్టు, అక్షయ్, ఆకాష్, హేమ, ఇలియాస్, ఇంతియాజ్‌లు కాంస్య పథకాలు సాధించారు. కరాటే చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, వైస్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్, టోర్నమెంట్ ఇన్‌చార్జి సలీం చేతుల మీదుగా పథకాలు అందుకున్నట్లు సోమవారం మాస్టర్ ఆర్భాత్ తెలిపారు. గ్రాండ్ చాంపియన్ షిప్ సైతం కైవసం చేసుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకోరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాస్టర్లు మూసి, వెంకటేష్, శేఖర్, అబ్బుజర్, నరేష్ పాల్గొన్నారు.



పథకాలు అందుకున్న విద్యార్థులు

నేడు ఇటిక్యాలకు పంచాయతీరాజ్ డైరెక్టర్ రాక

ఇటిక్యాల: రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన మంగళవారం ఇటిక్యాలకు ఎంపీడీఓ అజార్ మొహినుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రామ పంచాయతీలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ముగ్గురు రిమాండ్

గద్వాల క్రైం: ఆర్టీసీ డ్రైవర్ రఫిపై దాడి చేసిన కేసుల్లో ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఇటీవల పట్టణానికి చెందిన సర్దార్, జ్ఞానేశ్వర్, హరి మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అలంపూర్: పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు అలంపూర్ ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. కాషాపురం రోడ్డు శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా ఓ చెట్టు కింద పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ. 9,450 నగదు, మూడు మొబైల్ ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

13 గొర్రెలు చోరీ

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులో మేత మేస్తున్న 13 గొర్రెలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించిన నేపథ్యంలో బాధితుడు దేశి నాగన్న ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వనపర్తి జిల్లా పాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల గొర్రెల మందను మేత కోసం ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు శివారులోని పంట పొలాల్లో ఉంచారు. ఆదివారం దేశి నాగన్నకు చెందిన 5, రాములుకు చెందిన 3, బొబ్బరయ్యకు చెందిన 5 గొర్రెలు మొత్తం 13 గొర్రెలు దొంగలించినట్లు తెలిపారు. వాటి విలువ రూ.1,30,000 ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ధరూరు: మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చి, కల్వరి మందిరాల్లో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవ సీపీ ప్రసాద్ యూదా, పాస్టర్ కపరాజ్‌లు క్రీస్తు జననంపై వాక్య సందేశమిచ్చారు. క్రీస్తు జననాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దేవన్న, మత్తయి, సుదర్శన్, సత్యన్న, దానియేలు, పేతూరు, పాస్టర్ దేవదాసు, యోబు, యూత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మానవపాడు మండలంలోని 29 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద రూ.7.62 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కరుణసింహ్మారెడ్డి, కాంతారెడ్డి, వెంకట్రాముడు, రవి తదితరులు పాల్గొన్నారు.

మా సమస్య అసెంబ్లీలో ప్రస్తావించండి..

317 జీఓ బాధితుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలని పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేను కోరారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడును పంచాయతీ కార్యదర్శులు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 317 జీఓపై అసెంబ్లీలో ప్రస్తావించాలన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, రాఘవేంద్ర గౌడ్, రవిప్రకాష్ రెడ్డి, వినోద్, మనోహర్ పాల్గొన్నారు.

వివిధ రంగాల్లో ప్రతిభ చూపాలి



మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్‌కుమార్

అలంపూర్ : విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చూపాలని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో బాలోత్సవం- పిల్లల పండుగలో భాగంగా సోమవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 35 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈఓ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... సమాజ చైతన్యానికి సాహిత్య కలలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉత్సవాలు, సభలు, సమావేశాలు నిర్వహించిన ఆటపాటలతోనే మిళితమై ఉంటాయన్నారు. బాల్యంలోనే విద్యార్థులు అభిరుచులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రతిభ ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం జఫరుల్లా, ఉపాధ్యాయులు అరుణ కుమారి, శోభారాణి, కృష్ణవేణి, లక్ష్మీదేవి, పార్వతమ్మ, స్వప్న, సరిత, రాజారెడ్డి, మహబూబ్ బాషా, హనీఫ్ అహ్మద్, సుందరాజు, నూర్, బలగం నాగరాజు, లక్ష్మీకాంత్, సోమన్న, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్, కార్యదర్శి ఆశన్న, కళాకారులు నరసింహ, సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ శిఖరం పునఃప్రతిష్ఠ



ఉలిగేపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు

మల్దకల్ : మండలంలోని ఉలిగేపల్లి గ్రామంలో సోమవారం అభయాంజనేయ స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ ధ్వజ స్తంభ ప్రతిష్ఠను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్, బుచ్చిబాబు, లవన్న, విష్ణు, గోపాల్, చింతకిష్టన్న, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామంలో సోమవారం చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ శిఖరం పునఃప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవేలబుల్ సీట్ల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి

గద్వాల అర్బన్: జిల్లాకు మంజూరయ్యే బెస్ట్ అవేలబుల్ సీట్ల సంఖ్య పెంచాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, కార్యదర్శి కర్రెప్ప డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో ఎస్సీ దళిత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, కానీ సరిపడా సీట్లు కేటాయించలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు తల్లిదండ్రులు బెస్ట్ అవేలబుల్ సీట్ల కోసం రాజకీయ నాయకులు, పైరవీ కారుల చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాకు 300 సీట్లు కేటాయించాలని, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సీట్ల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు విజయ్‌కుమార్, ఆంజనేయులు, రాజు, మారెన్న, మధు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



రామాపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శాంతినగర్: కార్తీకమాసం సోమవారం పర్వదినం సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్తీక చివరి సోమవారం కావడంతో మహాశివుడికి పంచామృతాభిషేకాలు, లింగాష్టకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు గావించారు. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో వెలసిన ఉభయరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 1008 దీపాలు వెలిగించి మహాశివుడిని ఆరాధించారు. ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం జపిస్తూ భజనలు చేశారు.

ఉండవెల్లి: మండంలోని అన్ని గ్రామాల్లో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ వేడుక ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉత్తర నక్షత్రం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాలాదారులు శరణుగోష, అష్టోత్తరాలు, భక్తి గీతాలతో మార్మోగించారు. కార్యక్రమంలో గురుస్వామి సూర్య కాంతారెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, మాలాదారులు, భక్తులు పాల్గొన్నారు.

షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

శాంతినగర్: మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైన వెంటనే షీటీం నంబర్ 8712670312 సంప్రదించాలని షీ టీం సభ్యురాలు దివ్యవాణి అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్ సేవలు, విద్యా ప్రాముఖ్యత గురించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ కోసమే షీటీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్ అప్రోచ్ విధానం, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు శేషన్న, హన్మంతు, లోకేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.